క్లుప్తంగా

ఓటమి భయంతోనే తప్పుడు కేసులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటమి భయంతో తమ అధినేత రాహుల్ గాంధీపై తప్పుడు కేసులు బనాయిస్తోందని డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ప్రతిపక్షం లేకుండా చేయాలని ప్రధాని నరేంద్ర మోడీ కుట్ర పన్నుతున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. కాంగ్రెస్ నాయకులు తిరుమల్లేష్, ప్రసాద్ గౌడ్, హరి పాల్గొన్నారు.

డీఈఓకు వినతి

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షల్లో ప్రతిభగల విద్యార్థులకు అన్యాయం జరగకుండా గట్టి చర్యలు తీసుకోని పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న, జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు కోరారు. ఈ విషయమై మంగళవారం పరీక్షల పరిశీలకుడు వెంకట కృష్ణారెడ్డి, డీఈఓ రాఘవరెడ్డికి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి రోజు తెలుగు పరీక్షకు జిల్లాలోని మఠంలో అన్నమయ్య జిల్లా కేంద్రం రోయచోటి ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. ఈ విషయంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా నాయకుడు స్వరూప్‌తేజ్,పీడీఎస్‌యూ నగర నాయకులు నరసింహా, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కరుణించు మాతా... శ్రీ విజయదుర్గ!

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూల మూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

14 నుంచి ప్రచార యాత్రలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రజాస్వామ్య పరిరక్షణ, దేశ సమైక్యత కోసం ఈ నెల 14 నుంచి మే 14 వరకు ప్రచార యాత్రలు చేపట్టనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఓబులేసు వెల్లడించారు. మంగళవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో నిర్వహించిన సీపీఐ జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ పాలన పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందన్నారు. మోదీ ఆర్థిక అవకతవకలపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతోందన్నారు. బీజేపీ ప్రభుత్వం ఒక వైపు దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతూ మరో వైపు మతోన్మాద అజెండా అమలుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ఇలాంటి తరుణంలో దేశాన్ని కాపాడుకోవడానికి లౌకిక, ప్రజాతంత్ర వ్యవస్థలను పరిరక్షించుకోవడానికి నెల రోజుల పాటు చేస్తున్న ప్రచార యాత్రలో ప్రజలకు వివరిస్తామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, నాయకులు పులి కృష్ణమూర్తి, నాగ సుబ్బారెడ్డి, బషీరున్నీషా, కేసీ బాదుల్లా, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

జీ-20 అధ్యక్ష బాధ్యతలు భారత్‌కు గౌరవం

వైవీయూ : జీ-20 అధ్యక్ష బాధ్యతలను భారతదేశం తీసుకోవడం మనందరికీ ఎంతో గౌరవమని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ జి. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. మంగళవారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో జీ-20 సమ్మిట్ థీమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 2023 నవంబర్ 30వ తేదీ వరకు జీ-20 అధ్యక్ష బాధ్యతలను మన దేశం నిర్వహిస్తుందన్నారు. ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ ఆర్. నీలయ్య మాట్లాడుతూ ఒక భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు థీమ్‌గా జీ-20 సమ్మిట్ ఉందన్నారు. అనంతరం ఎన్‌సీసీ అధికారులు సుబేదార్ మేజర్ సహేంద్రసింగ్, బల్వంత్‌సింగ్‌లు జీ-20 సమ్మిట్ గురించి, దేశం సాధించిన ప్రగతి గురించి వివరించారు.

రేపటి నుంచి శ్రీ రామాయణ సప్తాహం

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరి ఆలయ ప్రాంగణంలో గురువారం నుంచి ఈనెల 12 వరకు శ్రీ రామాయణ సప్తాహం నిర్వహించనున్నట్లు శ్రీ బిత్ర పట్టాభిరామయ్య భగవద్గీత సత్సంగం అధ్యక్షులు కాకనూరు సుబ్బారెడ్డి తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని గీతా సత్సంగ మండపంలో ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు సాయంత్రం 7 నుంచి 8.30గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పుట్టపర్తికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు వి.అన్నాజీరావు సప్తాహంలో వక్తగా పాల్గొంటారని తెలిపారు.

3వ డివిజన్ ఇన్‌చార్జ్‌గా రవికుమార్

కడప రూరల్: కడప నగరం 3వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్‌గా నంద్యాల రవికుమార్‌తో పాటు ఉపాధ్యక్షుడిగా షేక్ రఫీ, ప్రధాన కార్యదర్శిగా జయచంద్రారెడ్డి తదితరులు నియమితులయ్యారు. తమ నియామకంపై వారు సంతోషం వ్యక్తం చేశారు.

అక్కచెల్లెమ్మలకు వరాల జల్లు

● ఆసరా పంపిణీ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలకు జగనన్న వరాల జల్లు కురిపిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు.వైఎస్సార్ ఆసరా మంజూరుతో మహిళల ఆనందానికి అవధుల్లేవని చెప్పారు. మూడో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం స్థానిక శంకరాపురంలోని స్కౌట్స్ హాల్ మైదానంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం మాట్లాడుతూ నాయకుడంటే ఒక విశ్వసనీయత ఉండాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ప్రతిపక్షనేత చంద్రబాబుకు పాలనలోని తేడాను ప్రజలు గుర్తించాలన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా మోసం చేశారని, వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో 98.5 శాతం హామీలు నెరవేర్చడం జరిగిందన్నారు. మళ్లీ మాయమాటలు చెప్పడానికి టీడీపీ నేతలు వస్తారని, వారి మాయలో పడొద్దని సూచించారు. నా ప్రభుత్వంలో మీకు మేలు జరిగితేనే మళ్లీ నాకు ఓటు వేయమని అడిగే దమ్ము, ధైర్యం ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రూ.2లక్షల కోట్లను డీబీటీ ద్వారా ప్రజలకు ఇవ్వడం జరిగిందని వివరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, నగర మేయర్ కె. సురేష్‌బాబు మాట్లాడుతూ 2019 తర్వాత కరోనా మహమ్మారి వల్ల రాష్ట్రం అతలాకుతలం అయినప్పటికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఆపలేదన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు, ఇప్పుడూ అదే బడ్జెట్ అని, వారు ప్రజలకు ఎందుకు మేలు చేయలేకపోయారని ప్రశ్నించారు. చంద్రబాబు, ప్యాకేజీ పవన్ కళ్యాణ్, ఇతర పార్టీల నాయకులు మళ్లీ వస్తారని.. వారి మాయలో పడొద్దని సూచించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ మాట్లాడుతూ టీడీపీ ఎన్‌టీఆర్ స్థాపించిన పార్టీ అని, చంద్రబాబుకు దమ్ముంటే సొంత పార్టీ స్థాపించి ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి మాట్లాడారు. అంతకుముందు వారు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్పొరేటర్లు సుబ్బారెడ్డి, మల్లికార్జున, రామలక్ష్మణ్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు పత్తిరాజేశ్వరి, బండి మరియలు, ఇన్‌చార్జులు శ్రీరంజన్‌రెడ్డి, ప్రసాద్, ఎన్. సుబ్బారెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, బంగారు నాగయ్య ప్రసంగించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, నాగేంద్రారెడ్డి, బాబు, జమ్మిరెడ్డి, నాగేంద్ర పాల్గొన్నారు.



వైఎస్సార్ ఆసరా మెగా చెక్‌ను అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు పార్టీ నేతలు అఫ్జల్ ఖాన్, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి తదితరులు

'మా నమ్మకం నువ్వే జగనన్నా' బ్యానర్లు ఆవిష్కరణ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నగర అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య ఆధ్వర్యంలో రూపొందించిన ×మా నమ్మకం నువ్వే జగనన్నా× బ్యానర్లను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కె. సురేష్ బాబు, డిప్యూటీ సీఎం అంజద్ బాషా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలోపేతానికి యువజన విభాగం ఆధ్వర్యంలో విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, కె. సూర్యనారాయణ రావు, చల్లా రాజశేఖర్ పాల్గొన్నారు.



బ్యానర్లను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్ బాషా, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్ బాబు

బకాయిలను వసూలు చేయాలి

కడప కార్పొరేషన్: లీజు పరిమితి పూర్తయిన షాపు రూముల బకాయిలు, బాడుగలు, ఎన్‌క్రోచ్‌మెంట్ ఫీజులు జరిమానాలు విధించి వసూలు చేయాలని కడప నగపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ తీర్మానించింది. మంగళవారం సాయంత్రం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ ఛాంబర్‌లో నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ కాంప్లెక్స్‌లోని 25 షాపుల లీజు కాలపరిమితి మూడేళ్లు పెంపుదల చేస్తూ కాంప్లెక్స్ పునఃనిర్మాణం చేపట్టుటకు తీర్మానించారు. కడప పాతబస్టాండులోని క్యాంటీన్‌ను లీజుకు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైవీస్ట్రీట్‌లోని పాతమార్కెట్ సమీపంలోని రైస్ మిల్‌ను కూల్చివేసి బాడుగలు వసూలు చేయాలని తీర్మానించారు. కొత్త కూరగాయల మార్కెట్, గొ ర్రెల, మేకల వధశాలలు, గొర్రెల, మేకల మాంసం అంగళ్లు, ఎద్దుల మాంసం అంగళ్ల గుత్తలు కేటాయించుటకు వేలం నిర్వహించగా హెచ్చుపాట పా డిన వారికి గుత్త కేటాయించే విషయానికి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ గ్యాస్ పైపులైన్ వర్క్‌లో నగరపాలక, ఆర్‌అండ్‌బీ రోడ్లను తవ్వాక, వాటిని సక్రమమైన పద్ధతిలో మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎం. సుబ్బారెడ్డి, శిరీష, మేసా ప్రమీల రాణి, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, ఎస్ఈ రత్నాల రాజు, సీపీ సంజీవ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, ఎంహెచ్ఓ ప్రశాంత్ వర్ధన్, ఆర్ఓలు కన్నయ్య, భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు

రహదారులను శుభ్రంగా ఉంచాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలోని ప్రధాన రహదారులను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు.మార్నింగ్ విజిట్‌లో ఆయన పలు ప్రాంతాలను పరిశీలించారు. మెయిన్ రోడ్డులో ఉన్న గార్బేజ్ పాయింట్లను తొలగించాలన్నారు.

నీటి ట్యాంకులను తరచూ శుభ్రం చేయాలి

నగరంలోని నీటి ట్యాంకులను తరచూ శుభ్రం చేస్తూ ఉండాలని కమిషనర్ ప్రవీణ్‌చంద్ సూచించారు. మంగళవారం నీటిసరఫరాకు ఆటంకం కలకుండా మాసాపేట ట్యాంకు నుంచి అమృత్ రెండో దశ ద్వారా ఏర్పాటు చేసిన కొత్త పైపులైన్ ద్వారా నీటి సరఫరా ఇవ్వాలన్నారు. నీటి ట్యాంకును పరిశీలించి పైపులైన్ నుంచి వచ్చే నీటి ఒత్తిడిని గమనించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నీటి సరఫరా చేయాలని సూచించారు. ఎంహెచ్ఓ, డీఈలు పాల్గొన్నారు.

'వన్‌స్టాప్'సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప వన్‌స్టాప్ సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలను బాధిత మహిళలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జెల వెంకట లక్ష్మి తెలిపారు. మంగళవారం కడప నగరంలోని రిమ్స్ ఆవరణలో ఉన్న వన్‌స్టాప్ సెంటర్ (సఖి, దిశ)ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిష్టర్లను పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బాధిత మహిళలకు ఆశ్రయం కల్పిస్తూ వారి సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత అడ్మినిస్ట్రేటర్‌పై ఉందన్నారు. అలాగే మహిళలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్రం అడ్మినిస్ట్రేటర్ అశ్విని, ఎస్ఐ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



వన్‌స్టాప్ అడ్మినిస్ట్రేటర్‌తో చర్చిస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జెల వెంకట లక్ష్మి

సంపత్‌కుమార్ దాతృత్వమే 'బ్రౌన్'కు ఊపిరి

కడప కల్చరల్ : నగరానికి చెందిన ప్రముఖ ఆడిటర్ సీకే సంపత్‌కుమార్ దాతృత్వమే బ్రౌన్ గ్రంథాలయ స్థాపనకు ముఖ్య కారణమైందని యోగి వేమన విశ్వవిద్యాలయం బాధ్య ఉప కులపతి ఆచార్య జింక రంగజనార్దన అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో బ్రౌన్ కేంద్రం స్థల దాత, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ సీకే సంపత్‌కుమార్ 21వ వర్ధంతి నిర్వహించారు. కుల సచివులు ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య, బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, ఆ కేంద్రం సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, సిబ్బంది గ్రంథాలయ ఆవరణలోని సంపత్‌కుమార్ విగ్రహానికి, అనంతరం చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. అనంతరం సంపత్‌కుమార్ ఆయన సేవలను కొనియాడారు. బ్రౌన్ కేంద్రం సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథ పాలకులు రమేష్‌రావు, హరిభూషణరావు పాల్గొన్నారు.

మాట తప్పని వ్యక్తి సీఎం వైఎస్ జగన్

● ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : డ్వాక్రా మహిళలకు ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన మాటను నెరవేర్చిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కమలాపురం ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల ఆవరణలో వెలుగు ఏపీఎం భాగ్యమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా మూడోవిడత సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను ఎవరూ కట్టవద్దని వాటి వడ్డీ మొత్తం చెల్లిస్తానని చెప్పి కనీసం వడ్డీ కూడా చెల్లించలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఎంత రుణం ఉంటే అంత రుణాన్ని నాలుగు విడతలుగా చెల్లిస్తానని హామీ ఇచ్చాడన్నారు. మాట ప్రకారం ఇప్పటికే రెండు విడతలు మహిళల ఖాతాల్లో జమచేయడమే కాకుండా ప్రస్తుతం మూడో విడత జమచేశాడన్నారు. ప్రతి మహిళల ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశాడన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం 555 సంఘాలకు సంబంధించి రూ.4,11,31,300 చెక్కును మహిళలకు ఆయన అందజేశారు. అనంతరం డ్వాక్రా సంఘాల సభ్యులు ముఖ్యమంత్రి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. సంబరాల్లో భాగంగా పాలగిరి గ్రామానికి చెందిన మహిళలు చేసిన కోలాటం అందరిని ఆకట్టుకొంది. యువనాయకుడు నరేన్ రామాంజుల్‌రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధక్షుడు రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

మురికి మడుగు!

కడప వైఎస్ఆర్ సర్కిల్: చెమ్ముమియ్యాపేటలోని లా కళాశాల రహదారిలో మురుగు నీరు నిల్వ ఉండి మడుగులా మారింది. ఈ ప్రాంతంలోని మురుగు కాల్వలు సక్రమంగా లేకపోవడంతో వర్షం కురిసిన సమయంలో మురుగు నీరు రోడ్ల నిల్వడంతో ప్రజలు దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీటిని తొలగించాలని పలుమార్లు నగరపాలక సంస్థ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు నీటిని తొలగించాలని కోరుతున్నారు.



రహదారిపై నిలిచిన మురుగు నీరు

అన్నదాతల ఆనందమే ప్రభుత్వ లక్ష్యం

● పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల : అన్నదాతల ఆనందమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక భాకరాపురంలోని పాడా ఓఎస్డీ కార్యాలయంలో మార్కెట్ యార్డు ట్రేడర్స్, చీనీ రైతులతో కలిసి మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్ రెడ్డిలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాడా ఓఎస్డీ మాట్లాడుతూ మార్కెట్‌లో ఎలాంటి సూట్ లేకుండా చీనీ కాయలను వ్యాపారులు కొనుగోలు చేయాలన్నారు. రైతులకు న్యాయమైన ధరలు అందించాలని ట్రేడర్స్‌ను కోరారు. ఈనెల 10వ తేదీ నుంచి వ్యవసాయ మార్కెట్‌లో చీనీ వ్యాపారుల మండి ప్రారంభమవుతుందని.. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పాడా ఓఎస్డీ నియోజకవర్గంలోని అన్ని మండలాల హౌసింగ్ ఏఈలు, ఎంపీడీఓలతో సమావేశమై జగనన్న హౌసింగ్ కాలనీల్లో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, డీడీ లావణ్య, ఏడీ అజాద్ వల్లి, హెచ్ఓ రాఘవేంద్రారెడ్డి, రైతులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పథకాలే శ్రీరామరక్ష

కమలాపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలే రాష్ట్ర ప్రజలకు శ్రీరామరక్ష అని మండలంలోని జంభాపురం పంచాయతీ వైఎస్సార్ సీపీ అడ్డా అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజుపాళెం సుబ్బారెడ్డి, జంభాపురం సర్పంచ్ ఇందిరెడ్డి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. శుక్రవారం జంభాపురం పంచాయతీ పరిధిలోని గొల్లపల్లె, సలతిమ్మాయపల్లెలో పలు కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరారు. వారిని మండల నాయకులు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జంభాపురం పంచాయతీలోని గ్రామాల్లో మొత్తం 120 కుటుంబాలు మాత్రమే ఉన్నాయని, వారిలో 100 కుటుంబాలు టీడీపీలో చేరారని టీడీపీ నాయకులు ఆర్భాట ప్రకటనలు చేశారన్నారు. దీంతో గ్రామస్తుల్లో తిరుగుబాటు మొదలై వారిలో అధిక సంఖ్యాకులు తిరిగి వైఎస్సార్ సీపీలో చేరారన్నారు. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, గంగిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రామకృష్ణారెడ్డి, గంగాధర్‌రెడ్డి, దస్తగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్గో పార్శిల్‌పై నిఘా పెంచుతాం

పులివెందుల రూరల్: ఏపీఎస్ఆర్టీసీ రవాణా సంస్థలో కార్గో పార్శిల్‌పై నిఘా పెంచుతున్నట్లు ఆర్టీసీ డీఎం ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండులోని తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్గోలో బుక్ చేసిన ప్రతి వస్తువును క్షుణ్ణంగా పరిశీలించి ఇతర ప్రాంతాలకు రవాణా చేయడం జరుగుతుందన్నారు. ఉన్నతాధికారి నుంచి ఆదేశాలు రావడంతో కార్గో పార్శిల్‌పై నిఘా పెంచుతున్నామన్నారు. హైదరాబాద్ తదితర రాష్ట్రాల నుంచి మద్యం, గుట్కా వంటి మాదక ద్రవ్యాలను బస్సులలో సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పార్శిల్ చేసే వారినుంచి ఆధార్ కార్డును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు.

ప్రణాళికే విజయానికి తొలిమెట్టు

● గ్రూప్-2 శిక్షణ తరగతుల్లో వైవీయూ వీసీ ఆచార్య జింక రంగజనార్ధన

వైవీయూ : సానుకూల దృక్పథం, మొక్కవోని ఆత్మవిశ్వాసం, ప్రణాళికబద్ధమైన సన్నద్ధత ఉన్నప్పుడే పోటీపరీక్షల్లో విజేతలుగా నిలుస్తారని వైవీయూ వీసీ ఆచార్య జింక రంగజనార్ధన పేర్కొన్నారు. మంగళవారం వైవీయూలోని సెంటర్ ఫర్ కాంపిటీటివ్ ఎగ్జామినేషన్ ఆధ్వర్యంలో ఏపీపీఎస్సీ గ్రూప్-2 ఉద్యోగ పరీక్షల శిక్షణ తరగతుల ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఏపీపీఎస్సీ సభ్యులుగా పనిచేసిన వీసీ తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. పరీక్షల సన్నద్ధత, షెడ్యూలు అమలుచేస్తూ నాణ్యమైన మెటీరియల్ చదవాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య , ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి , వైవీయూ సెంటర్ ఫర్ కాంపిటీషన్ ఎగ్జామినేషన్స్ డైరెక్టర్ డాక్టర్ నాగుల అంకన్న మాట్లాడారు. కార్యక్రమంలో పోటీపరీక్షల విభాగం సమన్వయకర్త మనోజ్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ ఆచార్య జింక రంగజనార్ధన

'సురభి' మినీ ఆడిటోరియం ప్రారంభం

జిల్లా చరిత్రను విశ్వవిఖ్యాతం చేసి కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చిన సురభి నాటక సమాజం రాబోయే తరానికి గుర్తిండిపోవాలని వీసీ రంగజనార్ధన పేర్కొన్నారు. వైవీయూలోని హ్యూమానిటీస్ భవనంలో నూతన సమావేశ మందిరాన్ని 'సురభి మినీ ఆడిటోరియం'గా నామకరణం చేసి రిజిస్ట్రార్ ,ప్రిన్సిపాల్‌తో కలిసి ప్రారంభించారు. లలితకళల విభాగం ఆచార్యులు డా. మూల మల్లికార్జునరెడ్డి , ఆర్ట్స్ విభాగం డీన్ ఆచార్య తప్పెట రామప్రసాద్ రెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి, ఐక్యూఏసీ డైరెక్టర్ డా. ఎల్. సుబ్రమణ్యం శర్మ తదితరులు పాల్గొన్నారు.

పుష్పగిరి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

18 నుంచి 27 వరకు బ్రహ్మోత్సవాలు

వల్లూరు : ఈనెల 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరగనున్న పుష్పగిరి శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, శ్రీ కామాక్షీ వైదనాథేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై మంగళవారం ఆలయాల ఈఓ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వరస్వామి ఆలయంలో సమీక్ష నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను సజావుగా నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్ల గురించి చర్చించారు.

గిరి ప్రదక్షిణ విషయంలో ఏకపక్ష పోకడలపై విమర్శలు

గత రెండు దఫాలుగా నిర్వహిస్తున్న పుష్పగిరి ప్రదక్షిణ కార్యక్రమ నిర్వహణలో ఏక పక్ష ధోరణిపై సమావేశంలో వాడి వేడి చర్చ జరిగింది. పుష్పగిరికి సంబంధించి ఆలయాల ధర్మకర్త, దేవాదాయ శాఖ అధికారులు, అర్చకులకు సంబంధం లేకుండా పుష్పగిరి పేరుతో ఏవేవో పేర్లు పెట్టుకుని ఏక పక్ష ధోరణితో కార్యక్రమాలను నిర్వహించడాన్ని సమావేశంలో పాల్గొన్న పలువురు ఖండించారు. కొంత మంది గిరి ప్రదక్షిణ పేరున నిధులు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోందని ఇది సరికాదని వారు తెలిపారు. పుష్పగిరి గిరి ప్రదక్షిణపై పుష్పగిరి పీఠాధిపతితో త్వరలో సమావేశమై ఒక నిర్ణయం తీసుకుందామని సమావేశంలో పాల్గొన్న పలువురు పెద్దలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సుమంత్ దీక్షితులు, పెద్దలు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, యర్రగుడిపాడు చెన్నకేశవరెడ్డి, సతీష్, పుష్పగిరి గ్రామస్తులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి

వైవీయూ: విద్యార్థులు చదువుతో పాటు సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అలవర్చుకోవాలని వైవీయూ సీడీసీ డీన్ ఆచార్య వై. సుబ్బరాయుడు సూచించారు. మంగళవారం కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాల బీబీఏశాఖ ఆధ్వర్యంలో కడప కన్వెన్షన్ హాల్‌లో సమ్యాఖ్-2కె23 ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ సమాజంలో అవకాశాలు చక్కగా ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకునే నైపుణ్యాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. కళాశాల అధినేత, వైవీయూ పాలకమండలి సభ్యుడు జి. సుబ్బారెడ్డి, రోటరీక్లబ్ ప్రెసిడెంట్ లేవాకు నితీష్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం వివిధ రకాల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, బీబీఏ విభాగాధిపతి కరీముల్లా, అనంత్ రెడ్డి, డాక్టర్ కె. ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎఫ్‌యూలో ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో మంగళవారం ముందస్తుగా బాబూజగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సూపరింటెండెం వై.పవన్ కుమార్‌రెడ్డి, ఈవెంట్ కోఆర్డినేటర్ మనోహర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున గంగాగౌరి సమేత ముక్తిరామలింగేశ్వరునికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం అంకురార్పణ, పంచగవ్యం, ధ్వజారోహణ, ఎదుర్కోళ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు గంగాగౌరి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు.

పుట్టినరోజు వేడుకలు

బద్వేలు : కాశినాయన మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ఎంపీపీ నల్లేరు విశ్వనాథరెడ్డి వేడుకలను మంగళవారం పోరుమామిళ్లలోని ఆయన స్వగృహంలో అభిమానులు, పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ మండలా నుంచి వేలాదిగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, పలువురు జడ్పీటీసీలు సర్పంచులు, ఎంపీటీసీలు, మండల, గ్రామస్థాయి నాయకులు రైతులు, స్నేహితులు తరలివచ్చి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. వారందరికీ ధన్యవాదాలు తెలపడంతో విందు ఏర్పాటు చేశారు.

పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయండి

చింతకొమ్మదిన్నె : మండలంలోని హౌసింగ్ పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని సీకేదిన్నె మండల ఉపాధ్యాక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం కడప నగరంలోని హౌసింగ్ కార్యాలయంలో హౌసింగ్ పీడీ కృష్ణయ్యను కలసి వినతిపత్రం అందజేశారు. మండలంలో చాలా మంది లబ్ధిదారులు హౌసింగ్ బిల్లులు తమఖాతాల్లో జమకాక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయనకు వివరించారు.

హనుమంతవాహనంపై ఆదిచెన్నకేశవస్వామి

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె గ్రామంలో గల శ్రీదేవి, భూదేవి సమేత ఆదిచెన్నకేశవ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజైన మంగళవారం స్వామివారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అలాగే బుధవారం స్వామి వారికి గరుడ వాహన సేవ నిర్వహించనున్నట్లు ట్రస్టు బోర్డు చైర్మన్ తెలిపారు. మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్ రెడ్డి, రంగారెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

ముద్దనూరు : ఈ ఏడాదిలో జరగనున్న వేసవికాల పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి బీజేపీ ప్రభుత్వం మాదిగ ఉపకులాలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లయ్య మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్సీ వర్గీకరణ బిల్లుకోసం ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి తహసీల్దారు కార్యాలయంలో వినతి పత్రం అందించారు.